క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం

జూలూరుపాడు: 20న హైదరాబాద్ గాంధీభవన్‌లో జరగనున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సేవాదళ్ ఉత్సవాలకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌ను సేవాదళ్ జిల్లా జనరల్ సెక్రటరీ కొదుమూరి కోటేశ్వరరావు ఆహ్వానించారు. మంగళవారం ఎమ్మెల్యేను కొత్తగూడెంలోని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో మోతుకూరి ధర్మారావు, అల్లాడి నరసింహారావు, ఏనుగుల అర్జున్‌రావు పాల్గొన్నారు.

సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

సింగరేణి(కొత్తగూడెం): జిల్లాలోని అన్నపురెడ్డిపల్లె తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలలో రెండు రోజులు గా సైన్స్ ఫేర్ జరుగుతోంది. రెండో రోజు మంగళవారం సింగరేణి కాలరీస్ (ఇల్లెందు, మణుగూరు, కొత్తగూడెం) పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ సందర్భంగా సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీ గుండా శ్రీనివాస్ మాట్లాడుతూ... ఇలాంటి సైన్స్‌ఫేర్ ప్రాజెక్టులు విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిస్తాయని విద్యార్థులందరూ పాల్గొనాలని కోరారు.

ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

జూలూరుపాడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీను అమలు చేయడంలో విఫలమైందని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ విమర్శించారు. మంగళవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. మాటల ప్రభుత్వమే గానీ చేతల్లో శూన్యమని విమర్శించారు. వికారాబాద్ జిల్లా లగచర్లలో జరిగిన ఘటనలో గిరిజనులపై అక్రమ కేసులు పెట్టడం దారుణమని, గిరిజనులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోర్ బంజారా పోరాట సమితి మండల అధ్యక్షుడు భూక్యా చరణ్, రాంబాబు, తేజ, నరసింహా, తదితరులు పాల్గొన్నారు.

బోనస్ చెల్లించండి..

సింగరేణి(కొత్తగూడెం): వ్యవసాయ కార్మికులకు ఆరు గ్యారంటీలలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లిస్తానన్న రూ.12 వేల బోనస్‌ను వెంటనే చెల్లించాలని, వ్యవసాయ కార్మికులకు విద్య, వైద్యం ఉచితంగా కల్పించాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్లపూడి రాము ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం కొత్తగూడెం జిల్లా కేంద్రంలో జరిగింది. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నాయిని రాజు, నూపా భాస్కర్, బొర్రా వెంకన్న, ఈసం చంద్రన్న, సాయి వెంకటేశ్వర్లు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా నెలకొన్న మైనారిటీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్‌ను కోరినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.యాకూబ్‌పాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర మైనారిటీ శాఖ వారు ప్రి మెట్రిక్ ఉపకార వేతనాలు రద్దు చేసినందున రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ బీసీలకు అందిస్తున్న విధంగా మైనారిటీ విద్యార్థులకు సైతం అందించాలని కోరినట్లు పేర్కొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

ఇల్లెందురూరల్: ఈ నెల 22న ముకుందాపురంలో నిర్వహిస్తున్న తెలంగాణ టైల్స్ వర్కర్స్ యూనియన్ (టీటీడబ్ల్యూయూ) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ యూనియన్ నాయకులు మంగళవారం పోస్టర్లు ఆవిష్కరించారు. రాంసింగ్, ఎస్‌కె మదార్, బుగ్గ రవి, వెంకట్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెంరూరల్: ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతుల నుంచి పత్తిని తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్న దళారులపై పీసా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు కేశవ్‌నాయక్ అన్నారు. ఈ మేరకు మంగళవారం లక్ష్మీదేవిపల్లిలోని వ్యవసాయ మార్కెట్ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర వ్యాపారులు సిండికేట్‌గా మారి పత్తిని తక్కువ ధరకు కొనుగోలు చేసి మోసం చేస్తున్నారని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేపు చెకుముకి సంబురాలు

కొత్తగూడెంఅర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ అధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి సంబురాలు 21వ తేదీన జరుగుతాయని రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఆహ్వానితులు కస్తూరి కొల్లునాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. విజేతలు జిల్లా స్థాయి పరీక్షలలో పాల్గొంటారని తెలియజేశారు.

సమస్యలు పట్టించుకునేదెవరు?

- శివనగర్‌లో దెబ్బతిన్న రోడ్లు
- డ్రెయినేజీ వ్యవస్థ లేక రోడ్లపై నిల్వ ఉంటున్న మురుగు
- ప్రమాదకరంగా మూలమలుపులు


శివనగర్ ప్రధాన రోడ్డుపై నిల్వ ఉన్న మురుగు


డ్రెయినేజీలు లేని ప్రధాన రోడ్డు


ప్రమాదకరంగా మూలమలుపు

పాల్వంచ: మున్సిపాలిటీలో అధికారుల వైఫల్యాల కారణంగా రూ.లక్షలతో చేపడుతున్న అభివృద్ధి పనులు సత్ఫలితాలను ఇవ్వడం లేదు. నిధులు వస్తే వాటిని వెంటనే ఎక్కడో ఒకచోట ఖర్చు చేసి చేతులు దులుపుకునే పరిస్థితి. ఇప్పటికే మున్సిపాలిటీలో చేపడుతున్న పనులు నాసిరకంగా ఉన్నాయనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. డ్రెయినేజీలు అడ్డగోలుగా నిర్మించారని విమర్శిస్తున్నారు. చేసే పని మరో సమస్యకు దారి తీస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఈ కోవలోనే పట్టణంలోని శివనగర్ కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనులు తేటతెల్లం చేస్తున్నాయి. ఇక్కడ వర్షాకాలంలో శివనగర్ దిగువ భాగంలో ఉండటంతో వరద ముంచెత్తుతుంది. దీంతో గతంలో భారీ ఎత్తున నిధులు వెచ్చించి డ్రెయినేజీ నిర్మాణాలు చేశారు. అయితే ఇవి అరకొరగా చేయడం, రోడ్డు ఎత్తుపల్లాలు, డ్రెయినేజీ నేరుగా పెద్ద కాలువలో కలపక పోవడంతో రోడ్డుపైనే మురుగు నిల్వ ఉంటోంది. అవగాహనా రాహిత్యంతో ఈ పనులు చేశారని స్థానికులు పెదవి విరుస్తున్నారు.

వాగును తలపిస్తున్న రోడ్డు..

శివనగర్ ప్రవేశంలో పాత రోడ్డు, ఇటీవల వేసిన రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉన్నాయి. దీనికి తోడు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించారు. దీంతో రోడ్డు మరింత అధ్వానంగా తయారయింది. వర్షం నీరు, మురుగు ఎటూ కదిలే వీలు లేక నిలల్వుండిపోతోంది.

అరకొరగా డ్రెయినేజీలు..

పట్టణ నడిబొడ్డున ఉన్న శివనగర్ ఏరియాలో డ్రెయినేజీ నిర్మాణాలు అరకొరగానే ఉన్నాయి. ప్రధాన రోడ్డు వద్ద కూడా డ్రెయినేజీ సగం మాత్రమే వేశారు. రాతి చెరువు అలుగు వల్ల ఈ కాలనీలో వర్షాకాలంలో వరద బెడద ఉంటుంది. దీని నుంచి రక్షణ పొందాలంటే డ్రెయినేజీలు పటిష్టంగా ఉండాలి. కానీ అధికారులు, పాలకులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు.

అధ్వానంగా మూలమలుపులు...

ఈ కాలనీలో మూలమలుపుల వద్ద రోడ్లు సగం వరకు దెబ్బతిన్నాయి. ఆ పక్కనే డ్రెయినేజీలు కూడా కూలిపోయాయి. వీటిని సరిచేయక పోవడంతో మలుపుల వద్ద వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మలుపు వద్ద అసలే తక్కువ విస్తీర్ణం ఉండగా, రోడ్డు, డ్రెయినేజీ దెబ్బతిని చిన్నగా మారి ప్రమాదకరంగా మారింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు అవగాహనతో నిధులు వెచ్చించి సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నాయి. తెలంగాణ నగర్‌కు వెళ్లే రోడ్డులో వీధిలైట్లు కూడా వెలగడం లేదు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ కె.సుజాతను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

ప్రధాన రోడ్డు అధ్వానం..



శివనగర్ ప్రధాన రోడ్డు ఏళ్ల తరబడి అధ్వానంగా ఉంది. ఇరువైపులా నిర్మించిన డ్రెయినేజీలు ప్రణాళికా బద్ధగా లేకపోవడం, రోడ్డు ఎత్తుపల్లాలుగా ఉండడంతో మురుగు ఏడాది పొడవునా రోడ్డుపై నిలుస్తోంది. రోజూ రాకపోకలు సాగించే మా ఇబ్బందు వర్ణనాతీతం. ఈ విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం శూన్యం.

– వినోద్, శివనగర్

రోడ్డుపై మురుగు నిల్వ ఉంటోంది..



కాలనీలో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది. పై నుంచి వచ్చే మురుగు కింది ప్రధాన కాల్వ వరకు డ్రెయినేజీ లేక నిల్వ ఉంటోంది. దీంతో దుర్వాసన, దోమలు బెడద, అపరిశుభ్ర వాతావరణం ఉంటోంది. మూలమలుపుల వద్ద రోడ్డు, డ్రెయినేజీ దెబ్బతిన్నది. వచ్చిపోయే వాహనాలకు ఇబ్బందిగా ఉంది. ప్రమాదాలు జరుగుతున్నాయి.

– రాజేందర్, శివనగర్

విద్యార్థులను ప్రోత్సహించాలి..


మాట్లాడుతున్న మణిమృదుల

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరితే వారి జీవితాలు సుమధురంగా ఉంటాయని గ్రంథపాలకురాలు మణిమృదుల అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం పలు పాఠశాలలకు చెందిన విద్యార్థినులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వాకిళ్లను రంగురంగుల ముగ్గలతో ముస్తాబు చేస్తే చూడముచ్చటగా ఉంటాయని, విద్యార్థులు కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా పిల్లల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు పలు రకాల కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, ప్రతిభకు పదును పెట్టి వెన్నుతట్టి ప్రోత్సహిస్తే కొత్తకొత్త ఆలోచనలు ఆవిష్కృతమవుతాయని చెప్పారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలని, దేనినైనా శోధించి సాధిస్తే ఆ సంతృప్తి వేరేగా ఉంటుందన్నారు. అబ్దుల్ కలాం అన్నట్లు గొప్ప గొప్ప కలలు కని వాటిని సాకారం చేసుకున్న నాడు జాతి గర్వించే బిడ్డలుగా తీర్చిదిద్దబడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మధుబాబు, నాగన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దతు ధర చట్టం అమలు చేయండి

టేకులపల్లి: వ్యవసాయ పంటలకు కనీస ధరల చట్టాన్ని అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆవునూరి మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం టేకులపల్లిలో జరిగిన టేకులపల్లి, కొత్తగూడెం, పాల్వంచ, జూలూరుపాడు నాలుగు మండలాల స్థాయి రాజకీయ శిక్షణ తరగతుల సభలో ఆయన మాట్లాడారు. 2024–25 బడ్జెట్‌లో ప్రకటించిన జాతీయ సహకార విధానం కార్పొరేట్లు వ్యాపారస్తులు పంటలు కోతకు రాకముందే ముందస్తు వ్యాపార లావాదేవీలతో పంటలను తమ స్వాధీనంలో ఉంచుకునే వీలు కల్పించడంతో పాటు సహకార రంగంలోని రుణాలను కార్పొరేట్లకు మళ్లించడానికి తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వ రంగంలో కార్పొరేషన్ మార్కెట్ యార్డులను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అద్దెకిస్తుండటం దారుణమని పేర్కొన్నారు. రైతాంగ చట్టాలను కేంద్ర పాలకులు తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. కేంద్రలో బీజేపీ ప్రభుత్వ రైతు, కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించేందుకు ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని ఆ క్రమంలో ఈనెల 26న జిల్లా కేంద్రాలలో జరిగే కలెక్టరేట్ ధర్నాలలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కల్తి వెంకటేశ్వర్లు, గౌని నాగేశ్వరరావు, తుపాకులు నాగేశ్వరావు, సారంగపాణి, డి.ప్రసాదు, ఎట్టి నరసింహారావు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీకి సన్మానం


రాజేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీలో కొత్తగూడెం ఏరియా నుండి ఎన్నికైన బూటుక రాజేశ్వరరావు, సకినాల సమ్మయ్య, రామారావు, రావి నాగేశ్వరరావులను ఐఎన్‌టీయూసీ ఆఫీస్‌లో మంగళవారం యూనియన్ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... కార్మికుల సమస్యల పరిష్కారంలో ఐఎన్‌టీయూసీ 75 ఏళ్లుగా కృషి చేస్తోందని, జాతీయ కార్మిక సంఘాల ముందు ఎన్నో ప్రాంతీయ సంఘాలు వస్తూనే, పోతూనే ఉంటున్నాయన్నారు. నిత్యం కార్మికుల సమక్షంలో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేది ఐఎన్‌టీయూసీ ఒక్కటేనన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, చిలక రాజయ్య, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులలో సామర్థ్యాలను పెంపొందించాలి

టేకులపల్లి: ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులలో మౌలిక భాష మరియు గణిత సామర్థ్యాలు పెంపొందించి డిసెంబర్ 4న జరిగే ఎస్ఏఎస్ పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని విద్యాశాఖ జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్ అన్నారు. ఈ మేరకు పాఠశాలల సందర్శనలో భాగంగా మంగళవారం బావోజీతండా తండా, దంతెలతండా, పాత లచ్చగూడెం ప్రాథమిక పాఠశాలలు, కిష్టారం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు.

దంతెల తండా ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల అభ్యసన స్థాయి బాగుండటం పట్ల అక్కడ ఉపాధ్యాయురాలు సుభద్రను అభినందించారు.

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి

మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరాగాంధీ జయంతిని కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. దేశం కోసం ఇందిరాగాంధీ కుటుంబం ప్రాణాలు అర్పించిందని, వారి సేవలు వెల కట్టలేనివన్నారు. పాల్వంచ మండల కేంద్రం దమ్మపేట సెంటర్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

– సాక్షి నెట్‌వర్క్


పాల్వంచ: ఇందిరాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పొదెం వీరయ్య

వరికొయ్యలను కాల్చొద్దు

సుజాతనగర్: వరి కోతల అనంతరం కొయ్యలను కాల్చకుండా కుళ్లిపోయేలా చర్యలు చేపట్టాలని ఏఓ జి.నర్మద ఓ ప్రకటనలో సూచించారు. వరికొయ్యల అవశేషాలపై ఎకరాకు 50 సూపర్ సల్ఫేట్, 10 నుంచి 15 కిలోల యూరియా చల్లాలని, నీటి తడి ద్వారా డీకంపోజింగ్ చేసుకోవచ్చని.. లేదా రోటవేటర్‌తో దమ్ము చేసుకోవాలని తెలిపారు. తద్వారా భూసారాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. అలాకాకుండా పంట అవశేషాలను కాలిస్తే వాయు కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు.

అందుబాటులో 'తేమ' యంత్రాలు

పత్తిలో తేమ నిర్ధారించే యంత్రాలు ఏఈఓల వద్ద అందుబాటులో ఉన్నాయని ఏఓ నర్మద తెలిపారు. రైతులు పత్తి తేమ 12 శాతం ఉందని నిర్ధారించుకున్నాకే సీసీఐ కేంద్రాలకు వెళ్లాలని, తద్వారా ఎలాంటి ఇబ్బందులు లేకుండా మద్దతు ధర లభిస్తుందని వెల్లడించారు.

పోస్టుల భర్తీకి రాత పరీక్ష

ఇల్లెందు: సింగరేణి సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీ కోసం మంగళవారం రాత పరీక్ష, ప్రాక్టికల్స్ నిర్వహించారు. ఎంవీటీసీ విభాగంలో చైన్‌మెన్, అసిస్టెంట్ చైన్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉండగా ఉద్యోగుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరీక్షలు నిర్వహించారు. ఎస్ఓటూ జీఎం బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు.

మిరప తోట పరిశీలన

జూలూరుపాడు: పాపకొల్లు గ్రామానికి చెందిన రోకటి సుధాకర్ సాగు చేసిన మిరప తోటను మంగళవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించారు. ఓ పురుగు మందుల దుకాణం యజమాని ఇచ్చిన కలుపు మందును పిచికారీ చేయడంతో మిరప తోట దెబ్బతిన్నదని బాధిత రైతు వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. కొత్తగూడెం కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ శాస్త్రవేత్త శ్రీమతి వి.లక్ష్మీనారాయణమ్మ, ఉద్యాన శాస్త్రవేత్త శివ, ఏఓ దీపక్ ఆనంద్ మిరపతోటను సందర్శించారు. అధికారులు మాట్లాడుతూ.. మిరప పంటను పరిశీలించామని, దెబ్బతినడానికి గల కారణాలను త్వరలో వెల్లడిస్తామని చెప్పారు.

నవ సంఘర్షణ అధ్యక్షుడిగా ధర్మయ్య

కొత్తగూడెంఅర్బన్: నవ సంఘర్షణ సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా బుర్ర ధర్మయ్య గౌడ్ ఎంపికయ్యారు. హైదరాబాద్‌లోని సర్వాయి పాపన్న గౌడ్ భవన్‌లో జరిగిన సమావేశంలో సమితి జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు అప్పగజేంద్ర యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు మంగళవారం ఒక ప్రకటన తెలిపారు.

ప్రభుత్వ భూమిని సర్వే చేయండి

పాల్వంచరూరల్: మండల పరిధి పాండురంగాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 126లో సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమతోందని దీనిని సమగ్ర సర్వే నిర్వహించి ఆదివాసీ గిరిజనులకు పంపిణీ చేయాలని కోరారు. ఈ మేరకు మంగళవారం గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, గిరిజన నాయకులు ఇర్పా ప్రకాశ్‌లు తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, సన్నవడ్లకు మద్దతు ధరకు అదనంగా రూ.500 చెల్లిస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం చేశారు. మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు గుర్తించి ప్రారంభించకపోవడంపై ఈ నెల 18న 'ధాన్యం కొనుగోళ్లు ఎప్పుడో' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. వెంటనే రేపల్లెవాడ గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తేమశాతం వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, పీఏసీఎస్ డైరెక్టర్లు కిన్నెర నర్సయ్య, పి.నాగేశ్వరరావు, కొమరయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మల్లమ్మ, నిర్మల, కోటయ్య, డీసీఓ ఖుర్షీద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ రాజశేఖర్‌రెడ్డి, సీఈఓ హీరాలాల్, రాజు, పంచాయతీ కార్యదర్శి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం..

టేకులపల్లి: కోయగూడెం ఓపెన్‌కాస్ట్‌కు వెళ్లే వాహనాలతో ఎగిసిపడుతున్న దుమ్ముతో అనారోగ్యం పాలై ఆస్పత్రుల్లో చేరుతున్నామంటూ దాసుతండా గ్రామస్తులు మూడు నెలలుగా పదే పదే ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులు తక్షణమే ప్రారంభించాలని ఆదేశించారు. దీంతో ఎట్టకేలకు మంగళవారం రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో రూ.70 లక్షలతో ఎంపవర్‌మెంట్ కేంద్రం, 24వ వార్డులో రూ.50 లక్షలతో సీసీ, డ్రెయినేజీ, 25వ వార్డులో రూ.30 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మంగళవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎస్‌కే సాబీర్‌పాషా, కాపు సీతాలక్ష్మి, కమిషనర్ శేషాంజనేయ స్వామి, ఇన్‌చార్జ్ తహసీల్దార్, డీఈ రవికుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి...

కొత్తగూడెంఅర్బన్: ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్‌ను నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మంగళవారం పట్టణ పరిధి 25వ వార్డులో రూ.30 లక్షలతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేసి మాట్లాడారు.

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులతో ఉపాధి

పాల్వంచరూరల్: విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసిన తర్వాత స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను నేర్చుకుంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కొల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో యూత్ ఎంపవర్‌మెంట్ (యువత సాధికరత) విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్ పద్మావతి, కొల్లి కల్పనాచౌదరి, రూప్లానాయక్ పాల్గొన్నారు.

కూలీ బంధు ఇవ్వండి



మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

ఇల్లెందు: రైతుబంధుతో పాటు కూలీలకు కూలీ బంధు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాల్లో మహిళలకు బస్సు సౌకర్యం మినహా ఏ ఒక్కటీ అమలు కావడం లేదన్నారు. స్థానిక సుందరయ్య నగర్‌లో మంగళవారం జరిగిన సీపీఎం మండల మహాసభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఒక్క లబ్ధిదారుడిని కూడా ఎంపిక చేయని ప్రభుత్వం 4.19 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు ప్రకటించటం విడ్డూరంగా ఉందన్నారు. గత కేసీఆర్ పాలనకు, నేటి రేవంత్‌రెడ్డి పాలనకు తేడా ఏమీ లేదని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మతోన్మాద విధానాలను పాటిస్తోందని వాటిని నివారించేందుకు సీపీఎం 29 పార్టీలతో ఇండియా కూటమిని ఏర్పాటు చేసిందని దీంతో గత ఎన్నికల్లో బీజేపీ బలం తగ్గిందన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య మాట్లాడుతూ... డిసెంబర్ 20, 21 తేదీల్లో ఇల్లెందులో జిల్లా మహాసభలు, అదే నెల 25 నుంచి 27 వరకు సంగారెడ్డిలో పార్టీ రాష్ట్ర మహాసభలు జరుగుతాయని తెలిపారు. సభలో సీపీఎం రాష్ట్ర, జిల్లా నాయకులు పి.సోమయ్య, మచ్చా వెంకటేశ్వర్లు, కె.నాగేశ్వరరావు, నరేందర్, జైబున్నిసా, లక్ష్మి, అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, మోహన్‌రావు, కృష్ణ, సంధ్య పాల్గొన్నారు.

కార్మిక సంఘాలపై ఆంక్షలు ఎత్తివేయాలి


ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఆర్టీసీలో 2019 నుంచి కార్మిక సంఘాలపై ఆంక్షలు విధించటం జరుగుతోందని వెంటనే అట్టి ఆంక్షలు ఎత్తివేయాలని, ఆర్టీసీలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, కార్మికులపై యాజమాన్యం, ప్రభుత్వం వేధింపులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కొత్తగూడెంలోని ఆర్టీసీ బస్ డిపో ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. మాట్లాడుతూ... గత టీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీలో కార్మిక సంఘాలపై విధించిన ఆంక్షలు ఎత్తి వేయాలని, వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలో యాజమాన్యం, ప్రభుత్వం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ కార్మికులపై పనిభారం మోపుతోందన్నారు. మహిళా కార్మికులకు కూడా అర్ధరాత్రి డ్యూటీలు వేస్తున్నారని, డ్యూటీ చేయకుంటే సెలవులు ఇచ్చేది లేదని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఈ పని వత్తిడి వల్లనే ఆర్టీసీలో యాక్సిడెంట్లు జరుగుతున్నాయని, దీనికి ప్రభుత్వమే కారణమన్నారు. కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

ఆస్పత్రుల్లో సమస్యలు పరిష్కరించండి..

ఇల్లెందురూరల్: పీహెచ్‌సీలలో సమస్యలు పరిష్కరిస్తూ కార్పొరేట్ ఆస్పత్రులలో దోపిడీని అరికట్టాలని కోరుతూ పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో మంగళవారం డీఎంహెచ్ఓ భాస్కర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాంకుడోత్ అజయ్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు సావిత్రి మాట్లాడుతూ.. ఏజెన్సీలో ఉన్న పీహెచ్‌సీలలో వైద్యులు, సిబ్బంది, మందుల కొరత వేధిస్తోందని ఫలితంగా పేదలకు సరైన వైద్యసహాయం అందడం లేదని వాపోయారు. గత్యంతరం లేక ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రులకు వెళితే పరీక్షలు, శస్త్రచికిత్సలు, మందుల పేరిట అందినకాడికి దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీలలో సౌకర్యాలు మెరుగుపర్చి వైద్యులు, సిబ్బంది నియామకం చేపట్టాలని, ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల దోపిడీని అరికట్టాలని కోరారు. ముత్తమ్మ, దేవా, కోటేష్, శంకర్, శాంతారావు, పాషా తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా నిలబడితేనే గుర్తింపు


అభివాదం చేస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కార్మికులు నిత్యం ఎదుర్కొంటున్న సమస్యలకు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ఏఐటీయూసీ నాయకత్వంపై ఉందని, కార్మికుల పక్షం వహించి వారిని ఉద్యమాలపై నడిపిస్తేనే నాయకుడిగా గుర్తింపు లభిస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసఫ్ అన్నారు. రెండు రోజులపాటు జరుగునున్న ఏఐటీయూసీ కొత్తగూడెం జిల్లా స్థాయి రాజకీయ, సైద్ధాంతిక శిక్షణ తరగతులు చుంచుపల్లి మండలంలోని గౌతంపూర్ సింగరేణి కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం ప్రారంభమయ్యాయి. నాయకులు మాట్లాడుతూ.. ఏఐటీయూసీ నాయకులు, కార్యకర్తలు కార్మికుల సమస్యలపై సత్వరమే స్పందించాలని, కార్మికులతో మమేకమై పనిచేసినప్పుడే నాయకుడిగా గుర్తింపు లభిస్తుందన్నారు. తద్వారా సంఘం బలోపేతమవుతుందన్నారు. కేంద్రంలోని మోదీ సర్కార్ బడా పారిశ్రామిక వేత్తలకు, పెటుబడిదారులకు కొమ్ము కాస్తోందని, కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను తాకట్టుపెడుతోందని ఆరోపించారు. కేంద్ర విధానాలపై కార్మిక వర్గం తిరగబడకుంటే ప్రమాదంలోకి నెట్టివేయబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ కమిటీ సభ్యులు పానుగంటి పర్వతాలు, ఉమా మహేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా పాల్గొన్నారు.